ఎన్‌హెచ్-65పై ప్రమాదం.. 8కిలోమీటర్లు ట్రాఫిక్‌జామ్

65వ జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

చౌటుప్పల్, జూలై 31 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లక్కారం తంగేడువనం సమీపంలో జాతీయ రహదారి-65పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. దాంతో సుమారు 8 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడకు లిక్కర్ లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న ఉల్లిగడ్డలలోడ్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉల్లిగడ్డల లోడ్ లారీ డ్రైవర్ మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లా తుజ్జపూర్ తాలుకా నందగావ్ గ్రామానికి చెందిన బన్సోడే అజయ్ అశోక్(23) తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందారు. రెండు లారీలు రోడ్డుపై అడ్డుగా ఉండడంతో ట్రాఫిక్ నిలిచి పోయింది. దెబ్బతిన్న లారీల్లో ఒకటి బీర్ల కాటన్‌తో, మరొకటి ఉల్లిగడ్డల బస్తాలలోడ్‌తో ఉండడంతో సమీప గ్రామ ప్రజలు, రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు వాటి కోసం ఎగబడ్డారు. అందిన కాడికి తీసుకెళ్లారు. దాంతో జాతీయ రహదారిపై సుమారు 8 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు రెండు గంటల పాటు శ్రమించి లారీలను పక్కకు జరిపి ట్రాఫిక్‌జామ్‌ను క్లియర్ చేశారు.

గీతామందిరం కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న స్థానికులు

చౌటుప్పల్, జూలై 31 : మండలంలోని కొయ్యలగూడెం గ్రామంలోని శ్రీకృష్ణ గీతామందిర కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం యాదగిరి, ఉపాధ్యాక్షుడిగా జెల్ల శ్రీశైలం, ప్రధానకార్యదర్శిగా పొట్టబత్తిని పురుశోత్తం, సహాయ కార్యదర్శిగా అల్మాసిపేట రామకృష్ణా, కోశాధికారిగా మాచర్ల సుదర్శన్, కార్యవర్గసభ్యులుగా దొంత బాలనర్సింహ, వనం కృష్ణ, పర్వతాల శ్రీనివాస్‌రెడ్డి, పిల్లలమర్రి మురళి, జెల్ల సత్యనారాయణ, దేవులపల్లి లక్ష్మణ్‌మూర్తి, పెండెం శివకుమార్, జెల్ల రాఘవేంద్ర ఎన్నికయ్యారు.

మోత్కూరులో మున్సిఫ్ కోర్టు ఏర్పాటు చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మందుల సామేల్ వినతి

సీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

మోత్కూరు, జూలై 31: మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిఫ్ కోర్టు, తుంగతుర్తి, అడ్డగూడూరులో ఐటీఐ కళాశాలలను మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. బుధవారం అసెంబ్లీ అవరణంలో సీఎంను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు.

హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్ట్ చేయడమేనా మార్పు

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ. ఇమ్రాన్

హైదరాబాద్‌కు తరలివెళ్లిన నాయకులు, కార్మికులు

భువనగిరి అర్బన్, జూలై 31: హక్కుల కోసం ప్రశ్నించే వారిని అరెస్టు చేయడమేనా కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు అని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్ ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఏఐటీయూసీ ఆధ్వర్యం లో బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరుగుతున్న ధర్నాకు యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఆటో, హమాలీ, మధ్యాహ్న భోజన కార్మికులు తరలి వెళ్లారు. వారి వాహనాలను ఆయన జెండా ఊపీ ప్రారంభించారు. తరలివెళ్లిన కార్మికులను పోలీసులు ఇందిరా పార్కు వద్ద అరెస్టు చేసి హైదరాబాద్‌లోని చంద్రాయణ్‌గుట్ట పోలీస్ స్టేషన్‌తో పాటు పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఎండీ. ఇమ్రాన్ కార్మికులను పరామర్శించి మాట్లాడారు. తమ డిమాండ్ల సాధనకు ధర్నా చేయడం నేరమన్నట్లు పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదన్నారు. అధికారం లేనప్పుడు అరెస్టులపై నిర్బంధాలపై గగ్గోలు పెట్టిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే అక్రమ అరెస్టులకు, నిర్బంధాలకు నిర్వచనంగా మారిందన్నారు. ధర్నాకు తరలివెళ్లిన వారిలో మధ్యాహ్నం భోజనం వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సామల శోభన్ బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గణబోయిన వెంకటేశ్, సామల భాస్కర్, నాయకులు ఉన్నారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భువనగిరి అర్బన్, జూలై 31: భువనగిరి పట్టణంలోని చైతన్య విద్యాలయంలో 1995-96 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం స్థానిక ఎస్‌వీ ఫంక్షన్‌హాల్లో అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, లక్ష్మారెడ్డి, సత్యనారాయణ, రఘుపతి, భోగ శివ, చారి, అల్లె భాస్కర్, శ్రీరంజని, సబిత, చిక్క భాస్కర్, రమేశ్, నరేందర్‌రెడ్డి, రవిరాజ్, శేఖర్, శ్రీను, ప్రకాశ్, సంతోశ్, వేణు, నాగేందర్, సునీల్, రాజేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పాస్‌పోర్ట్ పోయినది
పోల శ్రీనివాసులు, S/o. పోల చంద్రయ్య, ఇ.నెం. 4-40, చేపూర్ గ్రామం, గుర్రంపోడు మం॥, నల్లగొండ జిల్లా నివాసికి చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ (No: T4750893) చేపూర్ నుండి గుర్రంపోడు బైక్ పైన ప్రయాణిస్తుండగా పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు.
9441581975

SSC మెమో పోయినది
★బొక్క సరిత D/o బొక్క సాగర్‌రెడ్డి లేట్, ఇ.నెం. 1-1-500, నెహ్రూనగర్, సూర్యపేట అను పేరుగల SSC మెమో సూర్యపేట నుండి MRO ఆఫీసుకు వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికినవారు సంప్ర: సెల్: 8096374155
NLG-000

CHANGE OF NAME
★ I, MANDADHI VENKATA NAGESHWAR RAO, S/o. MANDADHI RAMA RAO, R/o. H.No. 1-4-249/102/1/B/19/1/A, Balaji Nagar, Suryapet, Suryapet Dist., TG-508 213. Changed My Name as MANDADHI NAGESHWAR RAO, S/o. MANDADHI RAMA RAO.
TT-000000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు వెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059
మిర్యాలగూడ : 9182777059

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

విద్యార్థులను అల్పాహారం గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో, సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనివాస్‌నగర్ బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు ఉదయం అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించి నాణ్యత లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఉదయం పెట్టే అల్పాహారం లిస్ట్‌ను, బుధవారం లిస్ట్‌ను తనకు అందించాలని ఆదేశించారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వంద అడుగుల జాతీయ జెండా నిర్మాణ పనుల పరిశీలన

ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ గ్రౌండ్‌లో చేపడుతున్న వంద అడుగుల జాతీయ జెండా స్థూపం నిర్మాణ పనులను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. స్థూపం నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే పాత జిమ్ ఏరియాను పూర్తిగా తొలగించి కొత్తగా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

బొమ్మలరామారం, జూలై31 : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం కారు, డీసీఎం, ఆటో ఒకదానితో ఒకటి ఢీకొనడంతో నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం, ఆటోను కీసర నుంచి బొమ్మలరామారం వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి, కారు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్ గిద్దె మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అంజయ్య తెలిపారు.

అనుమానిత యువకులు పోలీసులకు అప్పగింత

బీబీనగర్, జూలై 31 : మండలంలోని జైనపల్లి గ్రామ సమీపంలోని చెరువు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురు యువకులను గ్రామస్తులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. యువకులను వివరాలు అడగగా పొంతన లేని సమాధానం చెప్పడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎన్. రమేశ్ గ్రామానికి వెళ్లి యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దేవస్థానంలో అవినీతి ఉద్యోగులను బదిలీ చేయాలి

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్.

యాదగిరిగుట్ట, జూలై31: అవినీతికి పాల్పడుతూ స్వామివారి ఆదాయానికి గండి కొడుతున్న యాదగిరిగుట్ట దేవస్థాన ఉద్యోగులను బదిలీ చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ దేవస్థాన ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారని, అధికారంలోకి రాగానే వారిని బదిలీ చేస్తామని చెప్పి, ఇప్పుడు వారికి కొమ్ముకాస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీరును గుట్ట ప్రజలు తప్పుబడుతున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీలో బీర్ల అయిలయ్య ప్రసంగాన్ని తప్పుబట్టారు. నేడు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దిష్టిబొమ్మ దహన కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు గుంటిపల్లి సత్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆకుల చంద్రమౌళి, పట్టణ ఉపాధ్యక్షుడు బందారపు మల్లేశ్, బీజేవైఎం పట్టణ, మండల అధ్యక్షులు బోడ బుచ్చిబాబు, గుండ్లపల్లి మధు నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో కార్మికులకు ఆటల పోటీలు

నార్కట్‌పల్లి, జూలై 31 : ఆర్టీసీ సిబ్బందికి పని ఒత్తిడి తగ్గించడానికి నార్కట్‌పల్లి డిపోలో బుధవారం క్రీడ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో కార్మికులు, బస్ డ్రైవర్లు, కండక్టర్లు ఆటలు ఆడారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్టీసీ ప్రారంభించిన 'లక్షే లక్ష్యం'కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి ఒత్తిడి తగ్గించడానికి పోటీలు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు.

'ఏఎమ్మార్పీ కాల్వతో చెరువులను నింపాలి'

గుర్రంపోడ్, జూలై 31: ఏఎమ్మార్పీ కాల్వతో మండలంలోని చెరువులను నింపాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు వనమాల కామేశ్వర్ డిమాండ్ చేశారు. రెండేండ్లుగా వర్షాలు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, భూగర్భజలాలు అడుగంటాయన్నారు. చాలా మంది రైతులు తమ వ్యవసాయ బోర్లు పోయాక బత్తాయి తోటలను కాపాడుకోలేక పోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా చెరువును నింపి ఇప్పటి పంటలకైనా నీరు అందించాలని అన్నారు.

రేపు మాసకళ్యాణం

నకిరేకల్, జూలై 31 : పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా మాసకల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పల రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు అభిషేకం, 10 గంటలకు రుద్రహోమం, 11 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టీటీడీ స్థలంలో అధికార పార్టీ నాయకుడి అక్రమ నిర్మాణం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

చిట్యాలలో టీటీడీ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణం

చిట్యాల, జూలై 31: మండలకేంద్రంలోని టీటీడీ (తిరమల తిరుపతి దేవ స్థానం) స్థలంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకుడు అక్రమ నిర్మాణం చేస్తుండగా రెవెన్యూ అధికారులు బుధవారం అడ్డుకున్నారు. చిట్యాలలోని భువనగిరి రోడ్డులో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం కోసం ప్రస్తుత శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 23 యేండ్ల క్రితం చిట్యాలలోని వ్యాపారస్తుల వద్ద కొంత డబ్బు వసూలు చేసి ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన ఉమ్మడి భూమిని కొనుగోలు చేశారు. అయితే అప్పట్లో నిర్ణయించిన ధర ప్రకారం మరి కొంత డబ్బులు చెల్లించాల్సిన ఉందనే కారణంతో ఆ భూమిని సదరు వ్యక్తులు టీటీడీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయలేదు. దాంతో ఆ భూమి రికార్డుల ప్రకారం వారి పేరు మీదనే వస్తున్నట్లు తెలుస్తున్నది. ఈక్రమంలో ఆ భూమి యజమానులకు సంబంధించిన వారసుడు కొంత స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టాడు. విషయంపై కొందరు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తాసీల్దార్ కృష్ణ సదరు నిర్మాణాన్ని బుధవారం పరిశీలించి వెంటనే నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. కాగా అనుమతులు లేకుండా తీసుకున్న నల్లా కనెక్షన్‌ను బుధవారం సాయంత్రం మున్సిపల్ సిబ్బంది తొలగించారు.

నిర్మాణాన్ని నిలిపివేశాం : తాసీల్దార్ కృష్ణ

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేశాం. సదరు వ్యక్తి ఆ స్థలం తనదేనని, టీటీడీ పేరు మీద లేదని తెలిపాడు. అయినప్పటికీ తమకు అందిన ఫిర్యాదు మేరకు నిర్మాణాన్ని నిలిపివేశాం. రికార్డులను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం.

ఐసీడీఎస్‌లో మార్పులపై అవగాహన కలిగి ఉండాలి

- నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల

నల్లగొండలో మాట్లాడుతున్న సీడీపీఓ తూముల నిర్మల

నీలగిరి, జూలై 31: చిన్నారుల పూర్వ విద్య, గర్భిణులు, బాలింతలకు కోసం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు, మార్పులపై ప్రతి టీచర్ అవగాహన కలిగి ఉండాలని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల సూచించారు. స్థానిక రవీంద్రనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చర్లపల్లి సెక్టార్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ విద్యను అందించేందుకు కొత్త కార్యక్రమాలను తీసుకొచ్చారని చెప్పారు. అలాగే ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సూచించిన విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో చర్లపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ పార్వతి, టీచర్లు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి: సీడీపీఓ

మాడ్గులపల్లి : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ చంద్రకళ సూచించారు. మండలంలోని పాములపాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేటి నుంచి ఈ నెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రజిని, అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, తల్లులు, బాలికలు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ఆయిల్‌ఫామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

ఆయిల్ పామ్‌ను విస్తృతంగా సాగు చేయాలి

- డీఏఓ శ్రీధర్ రెడ్డి

అర్వపల్లి, జూలై 31 : ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటలను సాగు చేస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధిలోకి రావచ్చని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురంలో నెమరుగొమ్ముల శిల్ప, రవీందర్‌రావు నూతనంగా సాగు చేస్తున్న ఆయిల్ పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుందన్నారు. జిల్లా ఉద్యాన వన అధికారి నాగయ్య మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులు, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఎకరానికి రూ.4,200 చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు తెలిపారు. గరిష్ఠంగా ఒక రైతుకు 12.50ఎకరాల వరకు డ్రిప్ రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారిణి స్రవంతి, మండల వ్యవసాయ అధికారి మల్లారెడ్డి, పట్టు పరిశ్రమ అధికారి ముత్యాలు, ఏఈఓ సత్యం, పతంజలి ఆయిల్ పామ్ డీజీఎం బి.యాదగిరి, మేనేజర్ హరీశ్,

ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, పుల్యా, రైతులు రవీందర్‌రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : ఏఎస్ఐ


కోదాడ రూరల్ : సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్న ఏఎస్ఐ చారి

కోదాడ రూరల్, జూలై31 : విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ ఏఎస్ఐ ఏపీ చారి అన్నారు. పట్టణ బాలుర ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 హెల్ప్ లైన్‌కి ఫోన్ చేసి సహాయం పొందాలన్నారు. హెచ్ఎం డి.మార్కండేయులు, ఉపాధ్యాయులు మీనాక్షి, బడుగుల సైదులు, ఖాజా, జానకిరామ్, పోలీసులు సిబ్బంది బి.నాగేశ్వర్‌రావు, వి. రాజశేఖర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మఠంపల్లి : సైబర్ నేరాల పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిస్ట్రిక్ మిషన్ కో ఆర్డినేటర్ చైతన్య అన్నారు. మండలంలోని బక్కమంతులగూడెం కస్తూర్బా గాంధీ పాఠశాలలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు ఎకో ఫ్రెండ్లీ శానిటరీ న్యాప్కిన్స్, స్టడీ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ విజయకుమారి, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రేవతి, వినోద్, తేజస్విని పాల్గొన్నారు.

రుణమాఫీ పొందిన రైతులకు పంట రుణాలు

- ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న పేలపుడి వెంకటేశ్వరు

మోత్కూరు, జూలై 31: రాష్ట్ర ప్రభుత్వ రుణమాఫీ పొందిన రైతులకు కొత్తగా పంట రుణాలు ఇవ్వనున్నట్లు మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. రూ.1.50లక్షల లోపు రుణమాఫీ కాని రైతులు ఏఈఓలు, సంఘం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న సంఘం భవన సముదాయ నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో సంఘం పాలకవర్గం సభ్యులు పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, స్వామి, సుజాత, పద్మ, లక్ష్మయ్య, సీఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ చైర్మన్ రాజు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జూలై 31 : ఇందిర మహిళాశక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వీధి వ్యాపారులకు, మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా వ్యక్తిగతంగా సభ్యురాలికి, సంఘంలో ఐదు లేదా ఆరుగురికి కలిపి బ్యాంకుల నుంచి రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సొంతంగా వ్యాపారం చేసుకునే వారు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వరనాయక్, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, మేనేజర్ పి.లింగయ్య, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ బి.కవిత పాల్గొన్నారు.

చలో అసెంబ్లీని అడ్డుకునేందుకు ఎక్కడికక్కడ అరెస్టులు

వన్ టౌన్‌లో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, నాయకులు

రామగిరి, జూలై 31: సివిల్ సప్లయ్ హమాలీ, మధ్యాహ్న భోజనం, రవాణా రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే 'చలో అసెంబ్లీ'కి తరలివెళ్లే ఆయా సంఘాల నాయకులు, కార్మికులను పోలీసులు ముందస్తుగానే అరెస్ట్ చేశారు. తెల్లవారు జామునుంచే ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు విశ్వనాథుల లెనిన్, హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, యాదయ్య, శ్రీను, రవి, నాగరాజు, పలువురు కార్మికులను అరెస్ట్ చేసి నల్లగొండ వన్‌టౌన్‌కు తరలించారు. జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్టులు జరిగాయి.

అనుమానాస్పద స్థితిలో రోడ్డు ప్రమాదం..ఇద్దరికి గాయాలు

మునుగోడు, జూలై 31 : మండలంలోని కొంపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం పలు అనుమానాలను రేకేతిస్తుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఆ గ్రామానికి చెందిన గంజి శివకు ,గంజి పరమేశ్‌తో కొన్ని ఏండ్లుగా భూమి వివాదం కొనసాగుతున్నది. ఈ విషయంపై బుధవారం పెద్ద మనుషులు ఇరువురిని పిలిపించి మాట్లాడే ప్రయత్నం చేశారు. కానీ ఏకాభిప్రాయం రాకపోవడంతో తిరిగి హైదరాబాద్‌లో ఉంటున్న ఇరువురు మధ్యా హ్నం బయల్దేరారు. పరమేశ్ తనతో పాటు వచ్చిన ఫ్రెండ్స్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా,గంజి శివ కారులో బయల్దేరాడు. ప్రయాణంలో రోడ్డు మీద ఇరువురి మధ్య ఏమైందో తెలియదు కానీ గ్రామ శివారులోని ఆంజనేయఆలయ సమీపంలో శివ కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దిగింది. బైక్‌పై వెళ్తున్న పరమేశ్‌కు, వెనుక కూర్చున్న వ్యక్తి కూడా స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు 108లో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదం పై ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నీటి సమస్యకు పూర్వ విద్యార్థి పరిష్కారం

పాలకవీడు : పాఠశాలలో బోర్‌ను వేయించే కార్యక్రమంలో ఎంఈఓ ఛత్రూనాయక్ తదితరులు

పాలకవీడు, జూలై31 : పాలకవీడు పాఠశాలలో గురువారం నూతన బోరు వేయించిన పూర్వ విద్యార్థి యరగొర్ల సైదులు వితరణ అభినందనీయమని ఎంఈఓ ఛత్రూనాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యరగొర్ల సైదులు ప్రస్తుతం జగిత్యాల జిల్లా అగ్నిమాపక శాఖఅధికారిగా పనిచేస్తున్నారని, పాఠశాలలో నీటి ఎద్దడి పరిస్థితులు తెలుసుకొని పాఠశాల ఆవరణలో బోర్ వేయించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ఇంజమూరి కాటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ బహూకరణ

నడిగూడెం, జూలై 31: నడిగూడెం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయురాలు శకుంతల బుధవారం పాఠశాలకు రూ.25వేల విలువ గల వాటర్ ఫిల్టర్‌ను బహూకరించారు. విద్యార్థులకు బెల్టులు, కంబాక్స్‌లను అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, మాజీ పీడీ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి బదిలీపై వెళ్లడం సహజం

ఎంపీడీఓ హరిసింగ్, సూపరింటెండెంట్ వెంకటాచారిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

మోతె, జూలై 31 : ప్రతి ఉద్యోగి బదిలీపై వెళ్లడం సహజమని మాజీ జడ్పీటీసీ పందిల్లపల్లి పుల్లారావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బదిలీపై వెళ్తున్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిసింగ్, సూపరింటెండెంట్ వెంకటాచారి, జూనియర్ అసిస్టెంట్ శోభ, పంచాయతీ కార్యదర్శులు కల్పన కవిత, శోభన, రేణుక, రామకోటిని ఘనంగా సన్మానించారు. తాసీల్దార్ సంఘమిత్ర, ఏఓ అరుణ, అర్డీబ్ల్యూ సీఐ మణికంఠ, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు సురేశ్, మాజీ సర్పంచులు యుగంధర్ రెడ్డి, పానుగోటి నరసింహారావు, ఎల్లయ్య, సామ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గారకుంటతండా వద్ద బ్రిడ్జిని నిర్మించాలి : సీపీఐ

గరిడేపల్లి, జూలై 31 : మండలంలోని గారకుంటతండా సమీపంలో గల సాగర్ కాల్వపై బ్రిడ్జిని నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. సాగర్ కాల్వను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ గరిడేపల్లి నుంచి అలింగాపురం వరకు వేస్తున్న డబుల్‌రోడ్డులో భాగంగా తండా వద్ద ఉన్న కాల్వకు పెద్ద గూనలు వేసి రోడ్డు వేస్తున్నారని, దీంతో ప్రయాణికులకు ఇబ్బంది కలిగే అవకాశం ఉందన్నారు. అక్కడ గూనలు కాకుండా నూతనంగా బ్రిడ్జిని నిర్మించాలని తెలిపారు. ఈ కాల్వ కింద పరెడ్డిగూడెం, గానుగుబండ, కొండాయిగూడెం, గంగానగర్, హనుమంతులగూడెం తదితర గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల భూమి సాగు అవుతున్నందున బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని అన్నారు. నాయకులు మెండె వెంకటేశ్వర్లు, సాంబయ్య, కోటయ్య, శంకర్, హేమ్లా, పుల్లమ్మ పాల్గొన్నారు.